క్లుప్తంగా

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేయాలి



అలంపూర్: హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో అలంపూర్ చౌరస్తాలోని విశ్వ శాంతి హైస్కూల్ విద్యార్థులతో బీజేపీ జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి జాతీయ వాదాన్ని చాటాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, మండల అధ్యక్షుడు పిడుగు వెంకటేశ్, బీజేవైఎం అధ్యక్షుడు పాల్వాయి వెంకటేశ్‌గౌడు, నాయకులు నాగేశ్వర్ రెడ్డి, గుర్నాథ్‌రెడ్డి, విజయ్, లక్ష్మణ్‌గౌడు, తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ



గద్వాల అర్బన్: కేరళలోని వయనాడు వరదతో నష్టపోయిన బాధితుల కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కో కన్వీనర్ కిరణ్ మాట్లాడారు. కేరళ రాష్ట్రంలో ప్రకృతి విపత్తు కారణంగా 400మందికి పైగా మృతి చెందారని, అందులో విద్యార్థులు కూడా ఉన్నారన్నారు. ఆపద సమయంలో కేరళ విద్యార్థులకు అండగా ఉండేందుకు ఎస్ఎఫ్ఐ తరుపున స్వచ్ఛందంగా విరాళాలు సేకరిస్తున్నామన్నారు. రూ.14,782 విరాళాలు రూపంలో వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, దామోదార్, వినోద్, శివకుమార్, సలీం ఉన్నారు.

పత్తి పంటను సంరక్షించుకోవాలి



ఉండవెల్లి: మండలంలోని భైరాపురం, బస్వాపురం గ్రామ శివారులో పత్తి, మొక్క జొన్న, కంది పంటలను ఏడీఏ సక్రియా నాయక్ పరిశీలించారు. సోమవారం ఏడీఏ పత్తి పంటను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో పత్తి పంటలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటేపంటలు దెబ్బతింటాయన్నారు. పంటలో చీడపీడలు గమనించి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ హసినాబేగం, రైతులు పాల్గొన్నారు.

డీఎంకు కృతజ్ఞతలు



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ధర్మవరం స్టేజీలో వనపర్తి డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు సోమవారం ఆపినందుకు వివిధ గ్రామాల ప్రజలు వనపర్తి డిపో మేనేజర్ వేణుగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కొంత కాలంగా వనపర్తి డిపో బస్సులను నిలపకపోవడంతో ప్రయాణికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల గ్రామస్తులు వనపర్తి డిపోలో డీఎంను కలిసి వినతి పత్రం అందించగా, వారి సమస్యను గుర్తించి తక్షణమే పరిష్కరించారు. దీంతో వల్లూరు, ధర్మవరం గ్రామాల ప్రజలు బస్సుకు కొబ్బరికాయలు కొట్టి ఆర్టీసీ సిబ్బందికి, బస్సులోని ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు.

ఉద్యోగులకు బదిలీ సహజమే



మల్దకల్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమేనని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్‌లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇటీవల మల్దకల్ నుంచి బదిలీపై వెళ్లిన ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని, మల్దకల్ హైస్కూల్లో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సూపరింటెండెంట్ నర్సన్న, సీనియర్ అసిస్టెంటు సూర్యప్రకాష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడుకు చెందిన బైక్ మెకానిక్ ప్రభు (23) ఆదివారం అర్ధరాత్రి హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం అయిజ మండలం బైక్ మెకానిక్ సంఘం సభ్యులు బాధిత కుటుంబ సభ్యులకు రూ.20వేలు అందజేశారు.

దేశాభివృద్ధిలో యువతది కీలకపాత్ర



మానవపాడులో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ సుజాత, చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ శివలీల

గద్వాల అర్బన్: దేశాభివృద్ధిలో యువతది కీలకపాత్ర అని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నషా ముక్త్ భారత్ అభియాన్ కింద ఐక్యంగా ఉండి, సమాజం, కుటుంబం, స్నేహితులు మాత్రమే కాకుండా, మనం డ్రగ్స్ రహితంగా ఉండేలా గట్టి నిర్ణయం తీసుకోవాలన్నారు. అనంతరం డీసీపీఓ నర్సింహ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిక కాకుండా మంచిగా చదువుకోని దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం నషాముక్త్ భారత్ అభియాన్‌పై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రమోహన్, వెంకటేశం, వినోద, సురేంద్రరెడ్డి, కళాశాల ఏఓ మక్బుల్, తదితరులు ఉన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని వైష్ణవి టాలెంట్ స్కూల్లో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వాటిని నిర్మూలించాలని, వాటిని ఉపయోగిస్తే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని సూచించారు.



పాతపాలెంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ సురేష్

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సాయుధ చైతన్య పాఠశాలలో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి శివ హాజరై చట్టాలపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాజోళి: బాల్య వివాహాలతో పిల్లల భవిష్యత్ అంధకారంగా మారుతుందని ఔట్ రీచ్ వర్కర్ ప్రకాష్ అన్నారు. మండలంలోని పెద్ద తాండ్రపాడులోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటేశ్వర్లు, రామకృష్ణ, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కేటీదొడ్డి: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ సురేష్ అన్నారు. మండలంలోని పాతపాలెం జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు బాల్య వివాహాలు, మాదకద్రవ్యాలు, లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణ, భరోసా శివాని, సోషల్ వర్కర్ పద్మ, చైల్డ్‌లైన్ జయన్న, సఖి కేంద్రం శోభ, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్ గౌడు, పాండు నాయక్ ఉన్నారు.

మానవపాడు: మాదకద్రవ్యాల వల్ల భవిష్యత్ నాశనమువుతుందని, వాటి నివారణకు సమష్టిగా కృషి చేయాలని సీడీపీఓ సుజాత, చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ శివలీల సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని గంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. బాలకార్మికులుగా కనిపిస్తే 1098, 100లకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఎల్ సూపర్ వైజర్ రాగిణి, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, ప్రవీణ్, కళాశాల ప్రిన్స్‌పల్ పద్మావతి, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి ఉన్నారు.



గద్వాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీసీపీఓ నర్సింహ



పెద్ద తాండ్రపాడులో..



ఎర్రవల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న లీగల్ అధికారి శివ

తపాలా స్కీంలను సద్వినియోగం చేసుకోవాలి



అలంపూర్ రూరల్: తపాలా శాఖ ద్వారా అందిస్తున్న వివిధ రకాల స్కీంలను సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ సహాయ పర్యవేక్షకులు సైదా నాయక్ ప్రజలకు సూచించారు. మండలంలోని బుక్కాపురంలో సోమవారం బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ నారాయణరెడ్డి అధ్యక్షతన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (డీసీడీపీ) నిర్వహించారు. మహిళలకు, చిన్న పిల్లలకు, అన్ని వర్గాల ప్రజలకు తపాల శాఖ ద్వారా అందించే పొదుపు పథకాలు ఎస్బీ, ఆర్డీ, సుకన్య, పీపీఎఫ్, ఎంఐఎస్, టీడీ పొదుపు ఖాతాలు, గ్రామీణ తపాలా జీవిత బీమా పథకాలు వినియోగించుకోవాలన్నారు. పోస్టల్ పథకాలు గ్రామాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అన్ని గ్రామాల ప్రజలు తపాల సేవలు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అలంపూర్ సబ్‌పోస్ట్‌మాస్టర్ రవిచంద్ర, గద్వాల్ ఎంఓ సుధాకర్, మాజీ సర్పంచ్ మద్దిలేటి, అయ్యస్వామి, పోస్ట్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా ప్రణాళికపై ఉపాధ్యాయులకు అవగాహన

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని వైష్ణవి టాలెంట్ స్కూల్లో ఉండవెల్లి, మానవపాడు మండలాల పాఠశాల ప్రధానోపాధ్యాయులకు హరివిల్లు విద్యా ప్రణాళికపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ హరివిల్లు విద్యా ప్రణాళిక వల్ల 1–5వ తరగతి చదువుతున్న విద్యార్థులు రోజు ఉత్సాహంగా ఉంటారని, ప్రతిరోజు పాఠశాలకు చేరి, బాగా చదువుకుంటారని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మూర్తి, సురేష్, సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

శాంతినగర్: సమగ్ర శిక్షణఅభియాన్‌లో భాగంగా కేజీబీవీలో పనిచేస్తున్న ఉద్యోగులు మరణిస్తే వారి కుటుంబానికి వెంటనే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కేజీబీవీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. వడ్డేపల్లి కస్తూర్బాగాంధీ పాఠశాల, కళాశాలలో భోజన విరామ సమయంలో విధి నిర్వహణలో మృతి చెందిన కేజీబీవీ ఉద్యోగులకు నివాళులు అర్పించారు. అసువులు బాసిన ఉద్యోగులకు జేజేలు పలికారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత లేని కారణంగా, చాలీచాలని వేతనాలతో కుటుంబపోషణ భారం మోయలేకపోతున్నామని వాపోయారు. ఈ విషయమై ప్రభుత్వం స్పందించి ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటి వరకు మినిమం పే స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పద్మ, పీజీసీఆర్‌టీలు, సీఆర్‌టీలు, సీఆర్‌పీలు నాగేష్, పరమేష్, శాంతయ్యలు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: అలంపూర్ నియోజకవర్గంలోని మానవపాడు మండలానికి చెందిన ఉమా మహేశ్వరికి ఆపరేషన్ కోసం రూ.2లక్షల ఎల్‌ఓసీని కర్నూల్‌లోని చల్లా కాంపౌండులో ఎమ్మెల్యే విజయుడు బాధిత కుటుంబ సభ్యులు అందజేశారు. అనంతరం కర్నూల్‌లో చికిత్స పొందుతున్న వడ్డేపల్లి మండలం పైపాడుకు చెందిన మధుసూదన్‌రెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని వెంకట్రామనగర్ గ్రామానికి చెందిన చాకలి సవారి ఆపరేషన్ కోసం రూ.5లక్షల ఎల్‌ఓసీ కాపీని ఎమ్మెల్యే విజయుడు అందజేశారు. ఎమ్మెల్యే వెంట వావిలాల రంగారెడ్డి, పుల్లూరు రఘురెడ్డి, అనిల్ ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అయిజ: ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మండలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ జ్యోతి సమక్షంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు, కౌన్సిలర్లు సురేష్, దేవరాజు, వెకంటేష్, రాణెమ్మ, శశికళ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

శాంతినగర్: పైపాడు మాజీ ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డిని ఎమ్మెల్యే విజయుడు కర్నూలు ఆస్పత్రిలో పరామర్శించారు. గుండెకు సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయనను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్యంపై డాక్టర్లతో ఆరా తీశారు. నాణ్యమైన వైద్యం అందించాలని డాక్టర్లకు ఎమ్మెల్యే సూచించారు.

మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యంకు ఘన నివాళి



మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే దివంగత ఎర్రసత్యం వర్ధంతిని ముదిరాజ్ మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో ఎర్రసత్యం చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు ముదిరాజ్ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహులు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం సేవలు అందించడంతో పాటు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో జనార్దన్, దౌలన్న, జగదీష్, ఆంజనేయులు, వంట భాస్కర్, నర్సింహులు, జయరాములు ఉన్నారు.

అయిజ: మండల కేంద్రంలో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం వర్ధంతిని వివిధ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అశోక్, శేక్షావలి ఆచారి, శాంబశివుడు, ఆంజనేయులు, మధుకుమార్, దర్శల్లి పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ మృతులకు కొవ్వొత్తులతో నివాళి

శాంతినగర్: బంగ్లాదేశ్‌లో మృతిచెందిన వారికి జూలెకల్ యువకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. బంగ్లాదేశ్‌లో ఇటీవల జరిగిన అల్లర్లలో వందల మంది హిందువులు మృతి చెందారని, మారణహోమాన్ని యువకులు ఖండించారు. వడ్డేపల్లి మండలం జూలెకల్‌లో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించిన గ్రామం మధ్యలో నివాళులర్పించారు. ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వందమందికి పైగా యువకులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న యువకులు

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



శివునికి అభిషేకం చేస్తున్న భక్తులు



రాజోళిలో నాగమయ్య విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో కార్తీక రెండో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివున్ని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

శ్రావణ సోమవారం ప్రత్యేక పూజలు

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రావణ సోమవారం సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

రాజోళి: మండల కేంద్రంలోని భ్రమరాంబ అడివేశ్వరస్వామి ఆలయంలో కొలువైన నాగమయ్యలకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం రెండో సోమవారం కావడంతో అడివేశ్వర స్వామికి పూజలు చేసి, నాగమయ్యకు పాలు పోశారు. నూతన దంపతులతో పూజలు చేయించారు. రాజోళి, ఆయా గ్రామాల్లో పూజలు, ఉపవాసాలు ఆచరించారు. కర్నూల్ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద వీరన్న స్వామి దర్శనానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు.

ఓటరు జాబితా సవరణపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్

రాజోళి: ఓటరు జాబితాలో పలు సవరణకు సంబంధించి ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలకు సోమవారం శిక్షణ నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ఆధారంగా ప్రస్తుతం ఓటరు జాబితాలో సవరణలు చేయాలని, అవి ఏవిధంగా చేయాలో వారికి తెలిపారు. ఒకే కుటంబ సభ్యులై ఉండి, వేరు వేరు వార్డులోని ఓటరు జాబితాలో పేరు ఉన్న వారిని ఒకే చోట చేర్చాలని, దానికి అనుసరించిన నిబంధనలు, నియమాలను, పద్ధతులను తెలిపారు. ఈ విషయాన్ని గ్రామాల్లో ప్రజలకు తెలియచేసి వారి కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే చోట చేర్చాలని, ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకునేలా ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఏఐఎస్‌ఎఫ్ జెండాను ఎగరవేస్తున్న కృష్ణ

గద్వాల అర్బన్: ఏఐఎస్‌ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని బీసీ, ఎస్సీ బాలుర వసతిగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన వీరుల ఆశయసాధన కోసం 1936 ఆగస్టు 12న ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన ఈ విద్యార్థి సంఘం ప్రభుత్వ విద్యా పరిరక్షణ, శాస్త్రీయ విద్య, కామన్ విద్యావిధానం అమలుపై నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లోని దోపిడీని అరికట్టాలని, జిల్లాలోని హాస్టళ్లలోని మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, నాయకులు అంజి, కృష్ణ తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మల్దకల్: గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్యం మేరకు గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అందరూ తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ చెన్నయ్య, ఏపీఓ సుజాత, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాప్రాంగణాల్లో పరిశుభ్రత

ఉండవెల్లి: మండలంలోని బొంకూరు గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో ప్లాస్టిక్ కవర్లను, చెత్తను, పారిశుద్ధ్య కార్మికులతో ఎంపీఓ తిరుపతన్న తొలగింపజేశారు. స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా సోమవారం బొంకూరు క్రీడా ప్రాంగణంలో పారిశుద్ధ్యం పనులు చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రం చేసిన నాయకులు

అయిజ: మండల కేంద్రంలో సోమవారం బీజేపీ నాయకులు దేశనాయకుల విగ్రహాల పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గాంధీ చౌక్‌లో గాంధీ విగ్రహాన్ని, అంబేడ్కర్ చౌక్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని నీటితో శుద్ధి చేశారు. అనంతరం విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భగత్‌రెడ్డి, ప్రదీప్ కుమార్, భీమ్‌సేన్‌రావు, వెంకటేష్, లక్షణ్ గౌడ్, లక్ష్మణాచారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి



బొంకూరులోని క్రీడా ప్రాంగణంలో చెత్తను తొలగిస్తున్న కార్మికులు

నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మానవపాడు: కర్ణాటకలోని తుంగభద్ర నది డ్యాం 19వ గేట్ తెగిపోవడంతో వరద పెరిగే అవకాశం ఉందని, మానవపాడు మండలంలోని మద్దూరు, కొర్విపాడు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వాహీదా ఖాతున్ సూచించారు. సోమవారం తుంగభద్ర నది డ్యాం గేట్ తెగిపోవడంపై గ్రామాలను పర్యవేక్షించారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, నదిలో నీటి ప్రవాహం పెరిగితే అధికారులకు సమాచారం అందించి, సురక్షితమైన ప్రాంతాలకు ప్రజలు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్మరణ సభను విజయవంతం చేయండి

అలంపూర్: ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేందుకు ఏర్పాటు చేసిన సంస్మరణ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షులు మల్లెపోగు లక్ష్మణ్ పిలుపినిచ్చారు. 30 ఏళ్లుగా ఏబీసీడి వర్గీకరణ కోసం నిరంతరం పోరాడి అమరులైన వారిని స్మరిస్తూ ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నెల13న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన సోమవారం పిలుపునిచ్చారు.

జిల్లాస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక



మానవపాడు: మండల స్థాయి క్రీడల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మానవపాడు, చెన్నిపాడు, జల్లాపురం, కేజీబీవీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు రాష్ట్ర క్రీడల సమాఖ్య పీడీలు సింధు రాణి, తిరుపతి తెలిపారు. సోమవారం నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. బాలురు, బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, జంపింగ్ వివిధ క్రీడలకు ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎచ్ఎమ్ ఇన్‌చార్జి రామ్మూర్తి, లక్ష్మన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

కేటీదొడ్డి: మండల కేంద్రంలో నాయకుడు నాగప్ప మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోమన్‌రెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, నాయకులు ఉరుకుందు, హనుమంతు, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గద్వాల మండలంలోని పూడూరుకు చెందిన నాయక రవికుమార్ పని నిమిత్తం తన బైక్‌పై కర్నూల్‌కు వెళ్తున్నాడు. జాతీయ రహదారి ధర్మవరం స్టేజీ సమీపంలో హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న డీసీఎం వెనుక నుంచి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాయక రవికుమార్‌కు తీవ్ర గాయాలు కాగా, గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.